www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 25 ఆగస్టు 2023

జి.వేమవరం హైస్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - తాళ్లరేవు

క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఇచ్చే స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు మండలంలోని జి.వేమవరం పాఠశాలను వరించింది. జిల్లాస్థాయిలో 92 పాయింట్లు సాధించడంతో తృతీయ స్థానం సాధించిందని హైస్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. 2022, 23 విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయి వాలీబాల్, హ్యాండ్ బాల్, త్రో బాల్ వంటి ఆటల్లో విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ సాధించినందుకు ఈ అవార్డు వరించిందన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు స్వామిని పాఠశాల కమిటీ చైర్మన్ అనుకూలి శ్రీనివాసరావు, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపిటిసి యర్రంనీడి అప్పారావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

పేదల ఇళ్లు కూల్చిన వారిని శిక్షించాలి

- ఇళ్లను తక్షనం నిర్మించి ఇవ్వాలి
- సిపిఎం బృందం డిమాండ్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం గంగనపల్లిలో పేదల ఇళ్లు కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కూల్చివేసిన ఇళ్లను తక్షణం నిర్మించి ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలోని శాలిమామ కాలనీని వారు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, పార్టీ కాకినాడ రూరల్ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడారు. గంగనాపల్లి గ్రామంలో శాలిమామ కాలనీలో 40 ఏళ్లుగా నివాసముంటున్న వివిధ సామాజిక వర్గాలకు చెందిన పట్టాలు ఉన్న 30 మంది పేదల ఇళ్లను కూల్చివేశారన్నారు. మంగళవారం ఉదయం అధికార వైసిపి నేతలు పేదల ఇళ్లపై బుల్డోజర్లతో, రౌడీలు, గుండాలు, హిజ్రాలు 500 మందితో దాడి చేసి ఇళ్లను కూల్చివేయడం దారుణం అన్నారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న ఒక పార్టీ నాయకుల అండతో భూ కబ్జాదారులు ఇది వారి స్థలం అంటూ పేదలు వేసుకున్న నివాస గృహాలను దౌర్జన్యంగా తొలగిస్తే పేదలు కోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు తీర్పు మేరకు ఎవరి స్థలంలో వాళ్లు ఇల్లు నిర్మించుకున్నారన్నారు. తాజాగా అధికార పార్టీ నేతలు దౌర్జన్యంగా 4 బుల్డోజర్లు, గూండాలను, కిరాయి రౌడీలు, హిజ్రాలను తీసుకుని వచ్చి క్షణాల్లో పేదలు నిర్మించుకుంటున్న ఇళ్లలను నేల కూల్చడాన్ని పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ అప్పులు చేసి నిర్మించుకున్న ఇల్లును వారి కళ్ల ముందే కూల్చివేస్తుంటే అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఈ సమస్యపై పోరాటానికి సిపిఎం ముందుంటుందని అక్కడ ఉన్న ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తక్షణమే కూల్చివేతదారులపై కఠిన చర్యలు తీసుకుని, వెంటనే ప్రభుత్వ సొమ్ముతో తిరిగి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, అందుకు జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిపిఎం కాకినాడ రూరల్ నాయకులు చిట్టూరి విజయ్ కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, చింతపల్లి అజయ్ కుమార్, తొట్టిపూడి రాజా, వాసంశెట్టి చంద్రరావు, చైతన్య రెడ్డి పాల్గొన్నారు. బాధితులు పంపన సుబ్బారావు, పంపన నాగేశ్వరరావు, దుప్పలపూడి లక్ష్మణరావు, శాసమ్మ, అనసూరి లక్ష్మి, దుప్పలపూడి సత్యవేణి, దేవిశెట్టి వెంకటలక్ష్మి, అనసూరి కష్ణ, పింకే సుబ్బలక్ష్మి పార్టీ బృందానికి తమ సమస్యలను వివరించారు.

ఇళ్లు కూల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

చెక్కును అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

నవరత్నాలు ద్వైవార్షికంలో 8,877 మందికి లబ్ధి

ప్రజాశక్తి-కాకినాడ

నవరత్నాలు-ద్వై వార్షిక నగదు మంజూరు కార్యక్రమం ద్వారా కాకినాడ జిల్లాలో 8,877 మందికి రూ.11.44 కోట్ల మేర లబ్ధి జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హత ఉండి నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోలేకపోవడం, బ్యాంకు ఖాతా వివరాలు సరిగా లేకపోవడం తదితర కారణాల వల్ల మిగిలిపోయిన వారికి నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమం ద్వారా లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి గ్రామీణాభివృద్ధి, విద్య, బిసి సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులు, వివిధ ప్రాంతాల లబ్ధిదారులతో కలిసి వర్చువల్‌గా హాజరయ్యారు. బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పథకాల లబ్ధిదారులు, విద్యార్థులకు రూ.11.44 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పథకాల లబ్ధి మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో అర్హులందరికీ సంతృప్తికర స్థాయిలో పథకాలు అందించినట్లు చెప్పారు. అర్హత ఉండి ఏ కారణంచేతనైనా లబ్ధి చేకూరకుండా ఉంటే వెంటనే గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే వెరిఫికేషన్ చేసి ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమంలో లబ్ధి చేకూరుస్తామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, బిసి సంక్షేమ శాఖ అధికారి ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, సాంఘిక సంక్షేమ జేడీ డి.వి.రమణమూర్తి, మత్స్యశాఖ జేడీ పీవీ సత్యనారాయణ హాజరయ్యారు.

వేగంగా ఓటర్ల సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఓటర్ల ఇంటింట సర్వే ద్వారా గుర్తించిన అంశాలను గురువారం సాయంత్రానికల్లా నూరు శాతం ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్, ఇఆర్ఒ సిహెచ్.నాగనరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఇందుకు సంబంధించి ఎఇఆర్‌ఒలు, ఆర్‌ఒలు, బిఎల్‌ఒలు ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన ఓటర్ల తొలగింపు, వివిధ మార్పులు, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి బిఎల్‌వోలు ద్వారా సేకరించిన మొత్తం సమాచారాన్ని తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు రోజుల్లో ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిసి కోనశ్రీనివాస్, ఎలక్షన్ డిటి మురళీకృష్ణ, డిసిపి హరిదాస్, ఎసిపి నాగశాస్త్రులు, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

అధికారులు, పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్

ప్రముఖ కళాకారుడు అప్పారావు మృతి

ప్రజాశక్తి-కోటనందూరు

భీమవరపుకోట గ్రామానికి చెందిన కళాకారుడు కడితి అప్పారావు (45) గురువారం మృతి చెందారు. ఆయన సనాతన సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో పాటు బుర్రకథ, హరికథ, సాంఘిక, పౌరాణిక నాటకాల్లో ప్రతిభగల కళాకారుడుగా రాణించారు. ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆయన ప్రదర్శనల్లో నవ్వులు వెల్లి వరిసేవి. దీంతో ఆయనను నవ్వుల రారాజుగా పిలిచేవారు. ఆయన భౌతికకాయానికి సర్పంచ్ జగటాల వీరబాబు ఎంపిటిసి సభ్యులు కొత్తపెల్లి మాణిక్యాలరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

టిడ్కో రుణాల ప్రక్రియ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడ్కో గృహాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బ్యాంకు లింకేజిని నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం టిడ్కో ఇళ్లకు సంబంధించి రుణ ప్రక్రియ, పెండింగ్ పనులపై మెప్మా అధికారులు, సిఒలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తొలి విడత 1152 టిడ్కో ఇళ్ళను త్వరలోనే అప్పగించనున్నామన్నారు. ఇందుకు సంబంధించి 989 మంది లబ్ధిదారులకు రూ.2.73 లక్షల చొప్పున బ్యాంకు లింకేజీ మాత్రమే వచ్చిందని, మిగిలిన 25 శాతం సొమ్మును వచ్చే బుధవారం లోపుగా నూరుశాతం అందేలా కృషి చేయాలన్నారు. రూ.8 కోట్ల బ్యాంకు లింకేజీ మంజూరు అవ్వాలన్నారు. సమాంతరంగా మార్ట్‌గేజ్ పూర్తయ్యేలా చూడాలన్నారు.

చంద్రయాన్-3 విజయంపై హర్షం

ప్రజాశక్తి-కాకినాడ, పిఠాపురం

స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో బాలవేదిక అధ్వర్యంలో చంద్రయాన్-3పై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించన బహుమతి ప్రదానోత్సవంలో పాఠశాల హెచ్ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం, బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లాడారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, సిహెచ్.రుషి ప్రసాద్, ఎంవిఎస్.రామకృష్ణ, జి.శ్రీనివాస్, సిహెచ్.శ్రీహరిరావు నాయుడు పాల్గొన్నారు. పిఠాపురం హార్వెస్ట్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్లు సత్య మోహన్ రెడ్డి, సత్యానంద రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనిల్ రవీంద్ర పాల్గొన్నారు.

పిఠాపురంలో హార్వెస్ట్ స్కూల్ విద్యార్థుల మానవహారం

పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ వేతనదారులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎపిఒ అన్నపూర్ణకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి కూలీలు పనులు చేసి నెలలు గడుస్తున్న ఇప్పటికీ వేతనాలు రాకపోవడం చాలా బాధాకరమని పెండింగ్ వేతనాలు వెంటనే ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, తాళ్లరేవు మండల సంఘం కమిటీ నాయకులు దుప్పి అదృష్టదీపుడు, మందనక్క తణుకురాజు, గోడి భాస్కరరావు, నేరేడుమిల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న యనమల కృష్ణుడు

వీరబాబు కుటుంబానికి యనమల కృష్ణుడు పరామర్శ

ప్రజాశక్తి-రౌతులపూడి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగమణి కుటుంబ సభ్యులను రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు ఎస్.అగ్రహారంలోని వారి స్వగృహంలో గురువారం పరామర్శించారు. మతికి గల కారణాలను ఆమె భర్త ఎఆర్ కానిస్టేబుల్ వీరబాబు, నాగమణి తల్లి లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపిపి భాస్కర్ బాబు, స్థానిక నాయకులు కిల్లాడ వరహాలు పాల్గొన్నారు.

వేగవంతంగా సరిహద్దు రాళ్ల ప్రక్రియ

ప్రజాశక్తి-కాకినాడ

భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకానికి సంబంధించి సరిహద్దు రాళ్లను వేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర భూ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలిసి విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయంలో నుంచి రీ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, సర్వే అధికారులతో కలిసి హాజరయ్యారు. రెండో దశ రీసర్వే పనులు, సరిహద్దు రాళ్ల వేసే ప్రక్రియ, మ్యుటేషన్, ఫైనల్ ఆర్ఒఆర్ తదితర అంశాలపై సిసిఎల్ఎ అధికారులు జిల్లా కలెక్టర్లతో చర్చించి పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వే లక్ష్యాలు నెరవేరే విధంగా క్షేత్రస్థాయి రెవిన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో సర్వే శాఖ ఎడి బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఎస్ఎఫ్ఐ ప్లీనరీ కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిఠాపురం

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు పిలుపు ఇచ్చారు. గురువారం పట్టణంలోని నండూరి ప్రసాదరావు భవన్‌లో ప్లీనరీ సమావేశాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి గంగా సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడారు. ఈ నెల 27, 28 తేదీల్లో పిఠాపురంలో సూర్యరాయ గ్రంథాలయంలో ప్లీనరీ నిర్వహిస్తామన్నారు. అందరికీ ఉచితంగా విద్య అందించాలని, చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని, విద్యా రంగంలో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యా అందించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కరపత్రాలు ఆవిష్కరించిన వారిలో ఎస్ఎఫ్ఐ పిఠాపురం మండల కార్యదర్శి కె.సిద్దు, మండల ఉపాధ్యక్షులు లోవరాజు, బాబి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన పలు ప్రాంతాల్లో అభివద్ధి పనులను పర్యవేక్షించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. జగన్నాథపురం, రామకృష్ణారావుపేటలో రహదారి విస్తరణ పనులు, పర్లోపేటలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, స్వర్ణాంధ్ర కాలనీలో రహదారి నిర్మాణ పనులు, సెవెన్ హిల్స్ ప్రాంతంలోని ఇతర అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎఇలు వై.నాగేశ్వరరావు, నాగ సతీష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

వడ్లమూరులో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కంటే వీర రాఘవరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నాణ్యతా ప్రమాణాలతో ఈ పనులు జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు జగదీష్, భార్గవి, ఉండమట్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పగడ్బందీగా గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం

ప్రజాశక్తి - పెద్దాపురం

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. గురువారం చట్టం పటిష్ట అమలుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కానింగ్ సెంటర్‌పై పర్యవేక్షణ ఉండాలన్నారు. సంబంధిత శాఖలు, కమిటీ సభ్యులు ఈ చట్టం అమలుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ చట్టంపై ప్రజలకు నిరంతరాయంగా అవగాహన పెంచాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎం అండ్ హెచ్ఒ డి.సరిత, డాక్టర్ ఎన్.సుదీప్తి, న్యాయవాదులు సత్య రవికుమార్, కందుల వెంకటాచలం, ఎన్‌జిఒ వాసవి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి -కరప

గొర్రిపూడి గ్రామంలో జనం కోసం పవన్ -పవన్ కోసం మనం కార్యక్రమంలో పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జి పంతం నానాజీ పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పలు పార్టీలకు చెందిన వారు జనసేనలో చేరడంతో పంతం నానాజీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. స్థానిక నాయకులు పుణ్యమంతుల అన్నవరం, అనుకుల రాంబాబు, హరీష్ ఆధ్వర్యంలో అరుంధతి కాలనీ, న్యూ అగ్నికుల క్షత్రియ కాలనీలో వారు పర్యటించారు. భోగిరెడ్డి కొండలరావు, బండారు మురళి, భోగిరెడ్డి గంగాధర్ రావు, సుందర సత్తిబాబు, సైనవరపు భవానీ శంకర్, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ, ఎం.రమేష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని కలిగి ఉండాలి

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షత వహించారు. సుమారు 1200 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య ప్రాముఖ్యత, పాలిటెక్నిక్ ద్వారా ఉపాధి అవకాశాలు, ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల సాధించిన గత విజయాలను వివరించారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ఉన్నత చదువా?.. ఉత్తమ కొలువా? నీ లక్ష్యం ఎటువైపు అనేది నిర్దిష్టంగా ఎంచుకోవాలని సూచించారు. మీ లక్ష్యం ఏదైనా ఆదిత్య అందుకు నూరు శాతం మీకు ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ఆదిత్య ప్రణాళికలను తల్లితండ్రులకు వివరించారు. ఈ యాజమాన్యంతో తల్లిదండ్రులు సహకరిస్తే విద్యార్థులకు బంగారు బాట వేయవచ్చని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సతీష్ మాకెన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ఎస్‌టివిఎస్.కుమార్, ఎవి.మాధవరావు, పాల్గొన్నారు.

ఘనంగా చినవలసల మహాలక్ష్మమ్మ తీర్థం

ప్రజాశక్తి-తాళ్లరేవు

గాడిమొగ పంచాయతీ చినవలసల మహాలక్ష్మి అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు సమకూర్చిన గజమాలను అమ్మవారికి అలంకరించారు. అనంతరం అనంతరం గ్రామ పెద్దలు యువకులు ఎంఎల్ఎ సతీష్ కుమార్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి ఊరేగింపు, గరగ నృత్యాలు నిర్వహించారు. ఈ తీర్థంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలతోపాటు, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

డ్రైనేజీపై అక్రమ కట్టడాల కూల్చివేత

ప్రజాశక్తి -కరప

మండల కేంద్రమైన కరపలో గురువారం డ్రైన్‌పై నిర్మించిన అక్రమ కట్టడాలను పంచాయతీ సిబ్బంది కూల్చివేయించారు. కరప గ్రామంలో ప్రజలు ఇళ్లలోని వాడిన నీరు బయటకు పోయేందుకు డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల డ్రైన్ పైనుంచి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. గ్రామ ప్రజలు, ప్రయాణికులు ఈ మురుగు నీరులోంచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు. డ్రైనేజీపైన వేసిన సిమెంట్ దిమ్మలు, అక్రమ కట్టడాలు వల్ల బజార్ సెంటర్లో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఈ సమస్య నెలకొంది. మురుగు డ్రైన్‌పై నిర్మించిన షాపులను సిమెంట్ దిమ్మలను తొలగించి నీరు కిందకు ప్రవర్తించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలోని గ్రామ కార్యదర్శి కె.నాగేందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

పంచాయతీ సెక్రటరీగా చక్రపాణి

ప్రజాశక్తి -కరప

కరప మండలం కూరాడ గ్రామపంచాయతీకి కార్యదర్శిగా ఎం.చక్రపాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ కూరాడ గ్రామ పంచాయతీలో ఉన్న పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తామని, ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. చక్రపాణి గతంలో వేళంగి గ్రామంలో పని చేశారు.

పార్టీలు బూత్ ఏజెంట్లను నియమించుకోవాలి

జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల సమయం నాటికి ఆయా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమిస్తే పోలింగ్ బూత్ పరిధిలో ఉన్న ఓటర్ల వివరాలు పై అవగాహనకు అవకాశం ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. ప్రస్తుతం 2024 ఎస్ఎస్ఆర్ ప్రక్రియ లో భాగంగా డోర్ టూ డోర్ సర్వే ఆగస్ట్ 22 వరకు నిర్వహించామని, 99 శాతం ఇళ్లను ను సందర్శించడం జరిగిందన్నారు. బుధవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆగస్ట్ 17 నుంచి ఆగస్టు 22 వరకు జరిగిన డోర్ టూ డోర్ సర్వే ఓటరు గుర్తింపు వివరాలు జెసి ఎన్.తేజ్ భరత్, డిఆర్ఒ జి.నరసింహులు తో కలిసి సమావేశం నిర్వహించారు. తేజ్ భరత్ మాట్లాడుతూ హేతు బద్ధత కలిగిన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఇంటింటికీ బిఎల్ఒ వెళ్లి ఓటరు జాబితా ప్రకారం ఓటర్లను గుర్తిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ స్థాయి ఏజెంట్ ను నియమించి ఆ జాబితా ఇవ్వాలని కోరారు. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికల జరిగే నాటికి రాజకీయ పార్టీలు నియమించిన అధికారిక ఏజెంట్‌కు ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల పై స్పష్టత వస్తుందని అన్నారు. ఆగస్ట్ 21 నాటికి ఇప్పటి వరకు సర్వే లో 101807 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. బూత్ స్థాయి రాజకీయ పార్టీల ఏజెంట్ గరిష్ఠంగా 10 వరకు ఓటరు నమోదు దరఖాస్తులు ఇచ్చే అవకా శం ఉన్న దృష్ట్యా ఆమేరకు ఇంకా ఓటరు గా నమోదు కానీ వారి వివరాలు బిఎల్ఒకి ఇవ్వొచ్చు నని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీలు ప్రతినిధులు కాంగ్రెస్(ఐ) ప్రతినిధి నలమాటి రమేష్ (శ్యామ్), వైసిపి ప్రతినిధి యుపి.వర్మ, టిడిపి ప్రతినిధి పి ఎస్.సుబ్రహ్మణ్యం, బిజెపి ప్రతి నిధి బొర్రా రామచంద్రరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగా 8706 మందికి రైస్ కార్డులు

ఏటా బియ్యం కార్డుల మంజూరులో భాగంగా ఆహార భద్రత చట్టం-2013 కింద రాష్ట్ర ప్రభుత్వం వారు పౌరసరఫరాల శాఖ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ పంపిణీ చేసేందుకు జనవరి-2023 నుంచి జూలై-2023 వరకు దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన జిల్లా లోని 8706 అర్జీదారులకు బియ్యం కార్డులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని జాయింట్ కలెక్టర్ / జిల్లా కలెక్టర్ (పౌర సరఫరాలు) ఎన్.తేజ్ భరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి మరియు వాలంటీర్ వద్ద నుంచి కొత్త రైస్ కార్డ్స్ బయో మెట్రిక్ ద్వారా అందజేస్తారని అన్నారు. కొత్తగా రైస్ కార్డులు పొందిన లబ్ధిదారులకు సెప్టెంబర్ -2023 నెల నుండి మొబైల్ డెలివరీ వాహనాలుద్వారా వారికి కేటాయించిన నిత్యావసర సరుకులను ఇంటి వద్దనే పొందాలన్నారు.

లబ్ధిదారులకు ద్వైవార్షిక నగదు మంజూరు

జిల్లాలో ద్వైవార్షిక మంజూరు కింద అర్హత కలిగి మిగిలిన 6,459 మంది లబ్ధిదారులుకు వివిధ పథకాల ద్వారా 7.38 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారని జాయింట్ కలెక్టరు ఎన్.తేజ్ భరత్ పేర్కొన్నారు. గురువారం సిఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నవరత్నాలు - ద్వైవార్షిక నగదు మంజూరు కింద వర్చువల్ ద్వారా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టరు ఎన్. తేజ్ భరత్, డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పీడీ డిఆర్‌డిఒ ఎస్.సుభాషిణి, డిఎల్‌డిఒలు పి. వీణా దేవి, వి.శాంతా మణి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి యం.సందీప్, డిఎస్ఒ పి.విజయ భాస్కర్, జిల్లా బిసి సంక్షేమ అధికారి పిఎస్.రమేష్ బాబు, డిపియం ఇ.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి ఎన్.తేజ్‌భరత్

నేరాలు ఘోరాలు

యువకుని అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

వివాహం చేయడం లేదని తండ్రిపై అలిగి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన కుమారుని ఉందతమిది.. ఐఎసిఎల్ కాలనీకి చెందిన కరాచీ గౌరీ శంకర్ చిన్న కుమారుడైన లోవరాజు తనకు వివాహం చేయడం లేదని తండ్రితో గొడవపడి 16వ తేదీన ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సారా కేసుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-చాగల్లు

కొవ్వూరు సెబి స్టేషన్ పరిధిలో కలవలపల్లి, మార్కొండపాడు గ్రామాల్లో సెబి ఇన్స్‌పెక్టర్ ఇటిఇవిఇవి.సత్యనారాయణ ఆదేశాల మేరకు గురువారం సాయంకాలం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో పాత నేరస్తులు బి.వాసు, కె.వెంకటేశ్వర రావును అదుపులోనికి తీసుకుని చాగల్లు తహశీల్దారు కార్యాలయం వద్ద హాజరు పరిచి బైండోవర్ చేసినట్టు సిఐ సత్యనారాయణ తెలిపారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి -మామిడికుదురు

కరవాకకు చెందిన వివాహితపై అదే గ్రామానికి చెందిన కొల్లు శ్రీను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు నగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పివిఎస్ఎస్ఎన్ సురేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెందిన బాధితురాలపై అదే గ్రామానికి చెందిన శ్రీను అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేయడంతో విషయాన్ని గ్రామ పెద్ద సమక్షంలో పెట్టినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితురాలు నగరం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం ఎస్ఐ సురేష్ తెలిపారు.

పరారీలో ఉన్న నిందితుని అరెస్టు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

తొమ్మిదేళ్లుగా పరారీలో ఉన్న పోక్సో చట్టం కేసులో నిందితుని అమలాపురం తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. అతనిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. 2014లో అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడిలో ఒక బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి గర్భవతిని చేసిన కేసులో ఉమ్మిడి దుర్గాప్రసాద్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ప్రసాద్ పరారీలో ఉన్నాడు. పలువురు దర్యాప్తు అధికారులు అనేక రకాలుగా ప్రయత్నించినా నిందితుడు పట్టుబడలేదు. హైదరాబాదులోని మియాపూర్‌లో ఎఫ్‌సిఐ కాలనీలో ఉంటున్న అతడిని పట్టుకుని తాలూకా పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

కాలువలో పడి వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి-కొత్తపేట

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి గల్లంతైనట్లు కొత్తపేట అదనపు ఎస్.ఐ డి.శశాంక తెలిపారు. కపిలేశ్వరపురం మండలం వీధివారిలంక గ్రామానికి చెందిన తోటకూర శ్రీనివాస్ కూలి పని చేసుకుంటూ జీవం సాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి వీధి విఘ్నేశ్వరరావుతో కలిసి బుధవారం కొత్తపేట బాలయోగి పేటకు తాపీ పని నిమిత్తం వచ్చారు. పని పూర్తయిన అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో రావులపాలెం ముక్తేశ్వరం ప్రధాన పంట కాలవ వద్దకు కాళ్లు, చేతులు కడుగు కునేందుకు పాంచాలరేవుకి వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలుజారి శ్రీనివాస్ గల్లంతయ్యాడు. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోకవరం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కృష్ణునిపాలెంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం గోకవరం మండలంలోని కృష్ణునిపాలెం గ్రామపంచాయతీ పరిధి సంజీవయ్యనగర్‌కు చెందిన పెదపాటి మల్లేశ్వరరావు (55) పశువులను మేత మేపుకొని సాయంత్రం ఇంటికి వస్తుండగా కృష్ణునిపాలెం గ్రామ శివారు రోడ్డుపై రంపచోడవరం నుంచి కోరుకొండ వైపుగా వెళుతున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ కారుతో ఇందుకూరుపేట వైపుగా పరారు కావడంతో గోకవరం కారుని వెంబడించి పట్టుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

అసాంఘిక కార్యక్రమాలపై చినకొండేపూడి గ్రామానికి చెందిన వ్యక్తి ఎస్ఐ కె.చిరంజీవికి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. చినకొండేపూడి నుండి చీపురుపల్లి గ్రామానికి వెళ్లే రహదారి పక్కన రోడ్డును ఆనుకుని ఉన్న పామాయిల్ తోటలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిపై ఎస్ఐ చిరంజీవికి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చిరంజీవి స్పందించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సారా కేంద్రంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని ఎర్రంపాలెం గ్రామ శివారున గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర ఆధ్వర్యంలో నాటు సారా తయారీ కేంద్రంపై దాడి చేశారు. ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్, సిఐ సునీల్ కుమార్, జగ్గంపేట సిఐ సూరి అప్పారావు, గండేపల్లి ఎస్ఐ వై గణేష్ కుమార్ స్పెషల్ టీం గా ఏర్పడి నాటు సారా తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేశారు. 800 వందల లీటర్ల బెల్లపు ఊటను, సారా తయారీ సామాగ్రిని ధ్వంసం చేసినట్లు ప్రేమ్ కాజల్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

ప్రజాశక్తి-చాగల్లు

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడిన సంఘటన చాగల్లు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జొన్నకూటి వెంకయ్యమ్మ నందమూరి వంతెన వద్ద గేదెను మేపుచుండగా విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు తెలిపారు. రెండు నెలల క్రితం రెండు గేదెలు జ్వరంతో మృత్యువాత పసడగా మొత్తం రూ.మూడు లక్షలు నష్టపోయినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

రైతులు వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవడం ద్వారా పంటను రక్షించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కే సంజయ్ కుమార్ అన్నారు.గురువారం పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో రైతులకు వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో భాగస్వామ్య కార్యాచరణ, పరిసర పొలాల విశ్లేషణ చేసి అందుకనుగుణంగా తెగుళ్లను గుర్తించి వాటి నివారణా మందులపై అవగాహన కల్పించారు. గుర్తించిన పొలాల్లో లింగాకర్షణ బుట్టలు రైతులతో ఏర్పాటు చేయించారు. ఈ పంట నమోదు ప్రక్రియ మొదలైనందున రైతులు సర్వే నెంబర్‌తో పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు బి.రాగస్రవంతి, ఎం.సత్తిబాబు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆపద్బాంధవి వాహనాలకు నీడ కరువు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఆ వాహనాలు ప్రజారోగ్యం కోసం నిరంతరం సేవలందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడే అత్యంత ప్రాధాన్యత గలవైనా నిర్లక్ష్యం వల్ల నిలువ నీడ లేకుండా పోయింది. వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అత్యవస సర్వీసులుగా వైద్య సేవలో నిరంతరం సేవలందిస్తున్న 108, 104, తల్లి బిడ్డల వాహనాలకు సామర్లకోటలో నిలువ నీడ లేకుండా ఎండకు, వానకు పాడవుతున్నాయి. సామాన్య ఆసుపత్రిగా ఉన్న సామర్లకోట ప్రభుత్వాసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)గా అభివద్ధి పరిచి వైద్య సదుపాయాలను మెరుగు పరిచారు. ఆసుపత్రికి చెందిన ఖాళీ స్థలాలు స్థానికంగా ఎక్కువగానే ఉన్నప్పటికీ అత్యవసర సేవలను అందించే 108, 104, తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలు నిలుపుకునేందుకు కనీసం షెడ్లులు కూడా లేని పరిస్థితి సామర్లకోటలో కనిపిస్తుంది. ఆసుపత్రిలో మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప టిడిపి ప్రభుత్వం ఉన్న సమయంలో నూతన భవనంతో పాటు అత్యవసర సర్వీసు వాహనాలకు ఒక కార్యాలయాన్ని నిర్మించనున్నట్టు చెప్పినా, వాటిని ఏర్పాటు చేయకపోవడంతో ఆసుపత్రి ఆవరణలో చెట్ల కింద బహిరంగ ప్రదేశంలోనే ఈ వాహనాలను నిలుపుకోవాల్సి వస్తోంది. ఆస్పత్రి ఆవరణలో ఖాళీ ప్రదేశం చాలానే ఉండగా కనీసం వాహనాల నిలుపుదలకు రేకుల షెడ్డు అయినా ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు ఎండకు, మంచుకు, వానకు తడుస్తున్నాయి. కాగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అన్ని మండలాలకు అత్యవసర సర్వీస్ వాహనాలు నిలుపుదల చేసుకునేందుకు ప్రత్యేక షెడ్లులు, కార్యాలయాలు అధికారులు కేటాయించారు. సామర్లకోట మండలం విషయానికొస్తే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరుబయటే వాహనాలను నిలుపుకోవాల్సిన పరిస్థితులు నెలకొంది. నియోజకవర్గ కేంద్రమైన పెద్దాపురంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అతిథి గృహంవద్ద, జగ్గంపేటలో పంచాయతీరాజ్ అతిథి గహం వద్ద, ప్రతిపాడులో మండల కార్యాలయం వద్ద కిర్లంపూడి, అనపర్తి మండపేట పిఠాపురం రామచంద్రపురం మండలాల్లో ప్రభుత్వ ఆసుపత్రిల వద్ద, సర్పవరం మండలానికి ఎస్ఆర్ఎంటి వద్ద, కాకినాడ నగరానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద, రాజానగరం మండలానికి మండల కార్యాలయం వద్ద అత్యవసర సర్విస్ వాహనాలు నిర్వహణకు కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అయితే సామర్లకోట మండలానికి మాత్రం ఏ సదుపాయం లేకపోవడంతో ఈ వాహనాలు ఎండకు ఎండి వానక తడిచి పాడయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ విషయం తెలిసి కూడా పట్టించుకోవడం లేదు. ప్రజల అనారోగ్య పరిస్థితుల్లో తక్షణమే వైద్య సేవలకు తరలించే 108 వాహనంతో పాటు గ్రామాల్లో మినీ హెల్త్ సెంటర్లుగా సేవలందిస్తున్న 104 వాహనానికి, ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా వారి గహాలకు చేర్చే తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనానికి తక్షణమే ఆసుపత్రి ప్రాంగణంలో గానీ, ప్రభుత్వ కార్యాలయాల వద్దగానీ ఆఫీస్ భవనం లేదా షెడ్లను ఏర్పాటు చేసి వాహనాల జీవిత కాలాన్ని పెంచడం ద్వారా మరింత విస్తత సేవలు ప్రజలకు అందించే విధంగా ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు, ఆసుపత్రికి వచ్చే రోగులు కోరుతున్నారు.

ఆసుపత్రి వద్ద ఆరు బయటే నిలువనీడ లేకుండా ఉన్న వాహనాలు

క్రీడా మెటీరియల్ పంపిణీ చేస్తున్న సభ్యులు

సమాజ సేవను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సమాజ సేవలో నిజమైన ఆనందం ఉందని, ప్రతి ఒక్కరూ సమాజ సేవను అలవర్చుకోవాలని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు రిక్కీ గూటం అన్నారు. సామర్లకోట షారోన్ బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ ఆర్.లాజరస్, మాధవి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఐసిసి అధ్యక్షుడు రిక్కీ గూటం, షరోన్ గూటం, జనరల్ సెక్రెటరీ ఆనంద్ స్టీఫెన్, కోషాధికారి పాలరాజ్ కమల్, ఉప కోశాధికారి జోషప్ ఆనంద్ పాల్గొన్నారు. స్టడీ సెంటర్స్ పిల్లలక క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం పాస్టర్ లాజరస్ దంపతులను ఘనంగా సత్కరించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.బ్లెస్సింగ్, వి.జాన్, ఆర్.లాజరస్, ఎం.వి.జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

రైతు క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతువ్యవసాయ క్షేత్రాలను సంబంధిత శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. రైతులకు తగు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త సిహెచ్‌వి.నర్సింగరావు, పెద్దాపురం వరి పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త వి.సునీత మండలంలోని ఎర్రవరం, సిరిపురం, పేరవరం, పెద్దనాపల్లి, సి.రాయవరం, తిరుమలి గ్రామాల్లో రైతు క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతానికి వరి పంట ఆశాజనకంగా ఉందని, అక్కడక్కడా ఆకుముడత తెగులు, కలుపు మొక్కలు అధికంగా న్నాయన్నారు. ఆకుముడత నివారణకు కార్పెట్ ఐడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

టిడిపి వలే ఇసుక ఉచితంగా ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ప్రజలకు ఉచితంగా ఇసుక అందజేశామని, ఆ విధంగా పేద ప్రజలందరికీ ఉచితంగా ఇసుక అందజేయాలని పార్టీ రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) డిమాండ్ చేశారు. టిడిపి ఆధ్వర్యాన పిల్లంక వద్ద నిల్వ చేసిన ఇసుక స్టాక్ వద్ద వెంకటరమణ సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడారు. ముఖ్యమంత్రి నుంచి ఎంఎల్ఎ స్థాయి వరకూ అవినీతితో ఇసకాసురులుగా మారిపోయారన్నారు. ఇటీవల చంద్రబాబు పర్యటనలో ఇసుక మీద జగన్ ప్రభుత్వాన్ని శ్వేతపత్రం విడుదల చేయాలని కోరినా ఇప్పటివరకూ స్పందించ లేదని అన్నారు. కాకినాడ జిల్లా పిల్లంక ర్యాంప్‌పై జెపి సంస్థకు ఇచ్చిన అనుమతులకు కాలం చెల్లినా తవ్వకాలు కొనసాగిస్తున్నారన్నారు.

నరేష్‌పై వ్యతిరేకతతోనే టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట జెడ్‌పిటిసి టికెట్టు జనసేన పార్టీకి మద్దతు ఇచ్చిన ఎలిశెట్టి నరేష్ భార్య అమృతకు ఇచ్చినందువల్లనే తాము టిడిపిలో చేరామని పి.వేమవరం గ్రామానికి చెందిన నాయకులు ముసిరెడ్డి రాంబాబు, శ్రీరాములు వెల్లడించారు. పి.వేమవరంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంల వారు జెడ్‌పిటిసి అమృతా నరేష్ చేసిన ప్రకటనలను తీవ్రంగా ఖండించారు. 2009 నుంచి తామంతా వైసిపికి సేవలు చేశామన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఎంఎల్ఎ టికెట్ తోట వాణికి పార్టీ కేటాయించగా ప్రస్తుత వైసిపి ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబుకు ఇన్‌ఛార్జి పదవి రావాలని జెడ్‌పిటిసి భర్త నరేష్ జనసేన పార్టీకి ఓట్లు వేయించి వైసిపికి అన్యాయం చేశారన్నారు. పార్టీలో కష్టపడిన వారికి కాక పార్టీకి అన్యాయం చేసిన వారికి దొరబాబు టికెట్ ఇచ్చినందున తాము మనస్తాప్తానికి గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు తదితరులు

మార్గదర్శి ఏజెంట్‌పై కేసు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మార్గదర్శి బ్రాంచి ఏజెంట్‌పై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కాకినాడ డ్రైరీఫారం సెంటర్‌కు చెందిన పెంకే మోజెస్ 2020లో మార్గదర్శి ఏజెంటు ద్వారా రూ.లక్ష విలువైన రెండు చీటీలను తీసుకుని, నెలకు రూ.2,500 చొప్పున సుమారు నాలుగు నెలలు కట్టారు. అతను అందులో ఒక చీటిని రూ.20 వేల తక్కువకు పాడుకున్నారు. తనకు రావాల్సిన రూ.80 వేలు కోసం మార్గదర్శి బ్రాంచి మేనేజర్‌ను సంప్రదించగా ష్యూరిటీల పేరుతో తాను ఎన్నిసార్లు తిరిగినా సొమ్ము ఇవ్వలేదన్నారు. మోజెస్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దస్తావేజులు పోయినవి

1. తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన ఏడిద బుల్లి వెంకయ్య గారి కుమారుడు ఏడిద అబ్బులుకు చెందిన సర్వే నెంబరు : 32/1లో 30 సెంట్లు భూమికి సంబంధించి దస్తావేజులు నెంబర్: 575/2006, 2. సర్వే నెంబరు: 32/1లో 37 సెంట్లు భూమికి సంబంధించి దస్తావేజులు నెంబర్: 122/2004 గల ఒరిజనల్ దస్తావేజులు రఘుదేవపురం నుండి రాజమండ్రి వెళుతుండగా మార్గమధ్యమంలో దస్తావేజులు పడిపోయినవి. దొరికిన వారు క్రింది చిరునామాలో సంప్రదించాలని కోరుతున్నాను.

చిరునామా:
ఏడిద అబ్బులు, రఘుదేవపురం
డోర్ నెంబర్: 5-23, సీతానగరం మండలం
తూర్పుగోదావరి జిల్లా
సెల్: 9502892692

ఇంటి పైకప్పు కూలి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

ఇంటి పైకప్పు కూలి కుటుంబంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన గండేపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ఇటీవల కురుస్తున్న వర్షాలకు గండేపల్లి గ్రామానికి చెందిన అప్ప పంతుల ఆదిలక్ష్మి, వారి కుమారుడు వెంకట కిరణ్ కుమార్తె విజయ నివాసం ఉంటున్న ఇల్లు వర్షం వచ్చి పోయిన తరువాత ఒక్కసారిగా ఇంటి పైకప్పు కూలిపోయింది. దీంతో వారికి గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. వారికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించి నూతన గృహం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు స్థానికులు తెలిపారు.

పైకప్పు కూలిన ఇల్లు

పురపాలక సంఘం - మండపేట

టెండరు నోటీసు ఆర్.ఓ.సి. నెం. 50/2023-ఇ1, తేది: 23-08-2023

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

మండపేట పురపాలక సంఘ ఇంజనీరింగ్ విభాగమునకు సంబంధించి 7 పనులకు గాను మున్సిపల్ సాధారణ నిధులతో రూ. 22.68 లక్షలు అంచనా వ్యయంతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు మండపేట పురపాలక సంఘ కమిషనరు వారిచే ఆన్-లైన్ ద్వారా కోరబడుచున్నవి.

1. షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది	:	ది. 24-08-2023
సమయం	:	ఉదయం గం॥ 10.00ల నుండి
2. షెడ్యూల్ డౌన్ లోడింగ్ ముగింపు తేది	:	ది. 31-08-2023
సమయం	:	సాయంత్రం గం॥ 04.00ల వరకు

3. మిగిలిన వివరాల కొరకు www.tender.apeprocurement.gov.in నందు చూడగలరు.

సం/- శ్రీ టి.రామ్‌కుమార్
కమిషనరు, మండపేట పురపాలక సంఘం

యానాం వార్తలు

5 కె రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్ఎఒ

ఉత్సాహంగా 5కె రన్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బాలయోగి క్రీడా మైదానంలో 5కె రన్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆర్ఎఒ మునిస్వామి, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి డిడి టి.రవిశంకర్ జెండా ఊపి ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 5కె రన్‌ను పుదుచ్చేరివ్యాప్తంగా నిర్వహించారని, గెలుపొందిన వారికి తగిన నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు. యానాంలో విజేతలుగా నిలిచినవారు పుదుచ్చేరిలో త్వరలో పాల్గొంటారని తెలిపారు. ఎస్ఆర్‌కె ఆర్ట్స్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలల విద్యార్థులు మొత్తం 135 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కల సుబ్బన్న, చింతా వెంకన్న, కొప్పనాతి రమేష్, భాస్కర్, కనకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మల్లాడి

డెంగ్యూ నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని పలు కాలనీల్లో ప్రజలు డెంగ్యూ బారిన పడుతున్నారని నివారణకు చర్యలు తీసుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆర్ఎఒ మునిస్వామిని కోరారు. మల్లాడి మాట్లాడుతూ మెట్టకూరు రమాబాయి నగర్, ఆది ఆంధ్రపేట, గణపతి నగర్, వంశీకృష్ణ కాలనీల్లో జ్వరాలు ప్రబలాయన్నారు. దీనిపై అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని డ్రైనేజీలు క్లీనింగ్ లేక నీరు నిలవ ఉండిపోవడంతో దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే మొత్తం ఖర్చును తానే భరించి క్లీనింగ్ చేయించి, దోమలు చేరకుండా బ్లీచింగ్ జల్లిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ప్రజల ఫిర్యాదుల మేరకు డెంగ్యూ ప్రభావిత ప్రాంతాలను ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాశం గురువారం సాయంత్రం పరిశీలించారు. డెంగ్యూ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

దీపావళి షాపుల లైసెన్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

దీపావళి పండుగను పురస్కరించుకుని తాత్కాలిక బాణాసంచా షాపులు పెట్టడానికి లైసెన్సులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ అధికారి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు లైసెన్స్ కోసం సైట్ ప్లాన్, లీజ్ అగ్రిమెంట్, రేషన్ కార్డ్, ఓటర్ ఐడి, ఆధార్ కార్డ్, ఎఇ-5 ఫారం జత చేయాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 లోపు యానాం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

నేడు ఖాతాదారుల సమావేశం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని ది సిటిజన్ కో-ఆపరేటివ్ బ్యాంకులో శ క్రవారం ఖాతాదారుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ బ్యాంకు మేనేజర్ కాశి అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు పాల్గొంటారనితెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే సమా వేశానికి ఖాతాదారులు విధిగా హాజరుకావాలని కోరారు. మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై ఖాతాదారులతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు బ్యాంకు సంబంధించిన పలు విషయాలను వివరిస్తామని తెలిపారు.

దస్తావేజు పోయినది

నా క్లయింటు అయిన కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలం, చెందుర్తి గ్రామం, డో.నెం. 1-269రు కాపురస్తుడు బత్తిన (లేటు) అప్పన్న గారి కుమారుడు **బత్తిన అప్పారావు** గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు తల్లి బత్తిన సర్రమ్మ గారి పేరున ఉన్న స్థలం, ఇంటి ఒరిజినల్ క్రయ దస్తావేజు నెం.356/1971రును తన ఇంటి నుండి ది.15-08-2023వ తేదీన కత్తిపూడిలోని బంధువుల ఇంటికి తీసుకొని వెళ్ళుచుండగా మార్గమధ్యంలో పడిపోయినది.

కావున ఎవరికైనా సదరు దస్తావేజు దొరికిన యెడల నా క్లయింటుకు గాని, ఈ క్రింది అడ్రసుకు గాని అందజేయగలరు. తగిన బహుమతి ఇవ్వబడును.

ఎం. విజయ్‌కుమార్, అడ్వకేటు
డో.నెం.3-1280, 1వ వీధి,
డి.ఎస్.ఆర్.నగర్, హుకుంపేట,
రాజమహేంద్రవరం,
సెల్: 9491291891, 8985941229

IN THE COURT OF THE 2nd ADDL. SENIOR CIVIL JUDGE, KAKINADA
O.S.No.106 / 2021

Between:
Gollapalli Lakshmana Babu ...Plaintiff
and
Karri Paddaraju
& Others ...Defendants

To:D6: Kurra Padmaja
W/o. Rajesh, R/o. D.No.2-79,
Padalavari Street, Penuguduru,
Karapa Mandal.

పై నెంబరు దావాలో 6వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హజరు నిమిత్తం ది.08-09-2023 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించ బడును. (కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

P.రామకృష్ణ,
M.చైతన్య కుమార్ అడ్వకేట్స్
మెహర్ భవన్, రామారావుపేట, కాకినాడ
సెల్: 9440178750